## తూర్పు కనుపూరులో పాఠశాల కొనసాగించాలి - బీజేపీ నేత కోటేశ్వరరావు డిమాండ్

**గూడూరు,పెన్ పవర్,జూలై 15:**

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు పంచాయతీ కేంద్రంలోని పాఠశాలను మూసివేసి, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవారిపాలెం కు తరలించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇలాంటివాటివల్ల గిరిజన చిన్నారులు చదువుకు దూరమై, గ్రామంలో ముత్యాలమ్మ ఆలయంలో భిక్షాటన చేస్తున్న దుస్థితిని ఆయన వివరించారు. దళితులు, గిరిజనుల విద్య హక్కును హరించకండి అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తూర్పు కనుపూరులోనే పాఠశాలను కొనసాగించాలని కోరుతూ, ప్రజలతో కలిసి ఆందోళన చేయడానికి సిద్ధమన్నారాయన.



పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

## క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

– విద్యార్థులకు సీఐ ఎన్.కిషోర్ బాబు సూచన



**గూడూరు పెన్ పవర్, జూలై 15**

చిన్నతనం నుండే విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుంటే చదువుల్లో రాణించి, సమాజంలో గౌరవాన్ని పొందగలరని సీఐ ఎన్.కిషోర్ బాబు అన్నారు. గూడూరు సమీపంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలిచిన విద్యార్థులకు బ్యాడ్జీలు అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్ ఫోన్ వినియోగం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని, దానికి దూరంగా ఉండి చదువులు, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. ఉపాధ్యాయులు సులభంగా అర్థమయ్యేలా బోధించడంతో పాటు విలువలు, సాంప్రదాయాలు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బస్సా రెడ్డి శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ సుధేష్ణ, హెడ్మాస్టర్ సురేష్, వైస్ ప్రిన్సిపల్ నంద తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలి...

ఐ సి డి ఎస్ సూపర్వైజర్ షేక్ షాను...



**సీతారామపురం పెన్ పవర్ జూలై 15**

అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడిఎస్ సూపర్వైజర్ షేక్ షాను అన్నారు. ఆమె మంగళవారం అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ, సింగారెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ హాజరు శాతాన్ని పెంచి చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. టి హెచ్ ఆర్ పిల్లలతోపాటు గర్భిణీలు, బాలింతలకు ఆధార్ మ్యాపింగ్ తో పాటు ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం స్టాకు వివరాలతో పాటు రిజిస్టర్ లను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, పావని పాల్గొన్నారు. పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ఐసీడిఎస్ సూపర్వైజర్ షాను.

## పోలేరమ్మ తల్లి పొంగళ్ళ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.

**కావలి : పెన్ పవర్ – (ఆర్సీ ఇంచార్జ్) జులై 15**

కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామంలో జరిగిన పోలేరమ్మ తల్లి గ్రామ పొంగళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం పాల్గొన్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు పలువురు ఇళ్లకు వెళ్లి మాటామంతి కలిపారు. దాదాపు డెబ్భై ఏళ్ల క్రితం తిరునాళ్ళ జరిగాయని, పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో మరలా ఇప్పుడు జరుగుతున్నాయని తెలిపారు.. పోలేరమ్మ తల్లి తిరునాళ్ళను ప్రతి సంవత్సరం పండుగ వాతావరణలో ప్రశాంతంగా చేసుకుంటూ అమ్మ ఆశీస్సులు పొందుతూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



### కావలి పట్టణంలో నడిబొడ్డులో అనుమతులు లేకుండా

# బహుళ అంతస్తుల నిర్మాణం

### పట్టించుకోని అధికార యంత్రాంగం. లక్షల్లో చేతులు మారాయని ఆరోపణలు. దీని వెనుక ఎవరి హస్తం...

**కావలి పెన్ పవర్ జులై 15**

కావలి పట్టణంలో నడిరోడ్డు సెంటర్ అయినా బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలకు తావిస్తుంది. అలాగే ఉషా నర్సింగ్ హోమ్ బజార్లు కార్నర్లో నిర్మిస్తున్న బహుళ అంతస్తులు కూడా సంబంధిత అధికారులు ఇలాంటివి కావలిలో ఎన్నో కోకలలో ఉన్నప్పటికీ అధికారులు తమ స్వలాభం కోసం లక్షల్లో డబ్బులు మొట్ట చెప్పినట్లు భవన యజమానులు కావలి పట్టణంలో తమ వాదనను వినిపిస్తున్నారు అయితే ఈ బహుళ అంతస్తులపై ఎందుకని మౌనం వహించారు. దీని వెనక బలమైన హస్తం రాజకీయ నాయకులదా... లేక... ప్రజలకు అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది. అదే కావలి పట్టణంలో ఒక సామాన్య మానవుడు ఎక్కడో మారుమూల ప్రదేశంలో ఇల్లు కట్టుకుంటుంటే ఆ ప్రాంత సచివాలయం టౌన్ ప్లానింగ్ వారు వెళ్లి పర్మిషన్ ఉందా లేదా లేకపోతే ఆపివేయాలని వారి మీద దౌర్జన్యం చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆ సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ అంతో ఇంతో ఆ భవన యజమానులు ముట్టచెప్పడంతో వారు మౌనంగా వెళ్లిన సందర్భాలు కూడా కోకోలుగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వం లో ఎన్నో అన్యాయాలు, అక్రమాలు, దోపిడీలు జరిగాయని, ప్రత్యామ్నాయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఈ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరిస్తుందని కావలి నియోజకవర్గం పట్టణ ప్రజలు జోరుగా చర్చించుకోవడం విశేషం . ఇప్పటికంటే గత ప్రభుత్వమే మేలు కదా అని అన్న సందర్భాలు కూడా కావలి పట్టణంలో అక్కడక్కడ కొంతమంది ప్రముఖులు కూర్చున్నప్పుడు మాట్లాడుకోవడం జరుగుతుంది. ఏది ఏమైనా అప్పటికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతైనా మేలు జరుగుతుంది అనే నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే ఈ ప్రభుత్వంలో అక్రమాలకు, అన్యాయాలకు ని లమైపోయి పోయింది. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఐన ఇటువంటి ఆక్రమణలు జరగకుండా నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సమగ్ర విచారణ జరిపించి, బహుళ అంతస్తులు యజమానుల దగ్గర వసూలు చేస్తున్న లక్షల రూపాయలు వెనుక గల అసలు రహస్యం ఏమిటో.... తెలుసుకొని ఇటువంటి అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటు ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు కోరుతున్నాయి.





# సాంప్రదాయ పంటల స్థానంలో వాణిజ్య పంటలకు ప్రోత్సాహం

### ప్రయోగాత్మకంగా మునగాకు,వెదురు,కొర్రమేను చేపల పెంపకం -డిఆర్డిఏ పిడి శ్రీదేవి

**చిత్తూరు పెన్ పవర్ జులై 15**



సాంప్రదాయ పంటల స్థానంలో వాణిజ్య పంటలను పండించడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ రైతులకు సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి వెల్లడించారు.ఆమె మంగళవారం చిత్తూరు నందు విలేకరులతో మాట్లాడుతూ.. వాణిజ్య పంటలకు అవసరమైన విత్తనాలను,సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు డిఆర్డిఏ అందజేస్తుందని తెలిపారు.డిఆర్డిఏ తరఫున పలుసంస్థలతో ఎం.ఓ.యు లను కుదుర్చుకున్నామని, తద్వారా రైతులు పండించిన వాణిజ్య పంటలను ఆ సంస్థలే రైతుల నుంచి కొనుగోలు చేస్తాయని తెలిపారు. జిల్లాలో మునగాకు పెంపకం,వెదుర్ల పెంపకం,కొర్రమేను చేపల పెంపకం ఈ సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే డ్వాక్రా మహిళలకు కిరాణా షాపులను,అరకు కాఫీ స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి ఆహార శుద్ధి పరిశ్రమ కింద మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని,రెండు మండలాలలో సమీకృత వ్యవసాయ విధానాలను అమలు చేసి అన్ని వాణిజ్య పంటలను ఆ మండలాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తామని వివరించారు. చిత్తూరు జిల్లాలో మునగాకు పెంపకానికి 7 మండలాలను ఎంపిక చేశామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఐరాల,తవణంపల్లి, బంగారుపాళ్యం గుడిపాల,యాదమరి, గంగాధర నెల్లూరు, పెనుమూరు మండలాల్లో ప్రయోగాత్మకంగా మునగాకును పండిస్తామన్నారు. ఇప్పటికీ 300 ఎకరాలను గుర్తించడం జరిగిందని,మరో 530 ఎకరాలలో మొనగాకు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మునగాకు 45 రోజుల తర్వాత కోతకు వస్తుందని,ఈ మునగాకును తమిళనాడుకు చెందిన సంస్థ రైతుల నుంచి కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసుకున్నారని తెలిపారు.30 రోజులకు ఒకసారి మునగాకు కోతకు వస్తుందని,ఒక ఎకరాకు ఖర్చులు పోను సంవత్సరానికి 50 వేల రూపాయలు మిగులుతుందన్నారు. మునగ కాయలను రైతులు స్థానికంగా అమ్ముకొని లాభం పొందవచ్చన్నారు. చిత్తూరు జిల్లాలో మునగాకు పౌడర్ ప్లాంటును కూడా స్థాపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.చిత్తూరు జిల్లాలోని ఎస్ఆర్ పురం,ఐరాల, రామకుప్పం మండలాల్లో వెదురు పెంపకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.బంజరు భూముల్లో 30 సెంట్లలో ఈ వెదుర్లను ప్రయోగాత్మకంగా పండిస్తామని తెలిపారు. ఇండస్ట్రియల్ ఫౌండేషన్ గ్రూపు వెదుర్లను కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు.నాలుగవ సంవత్సరం నుంచి వెదురు కోతకు వస్తాయన్నారు.మొదటి సంవత్సరం రైతుకు 40 వేలరూపాయల ఆదాయం ఉంటుందని, తర్వాత ప్రతి సంవత్సరం రెట్టింపు అవుతుందని వివరించారు. తవణంపల్లి,చౌడేపల్లి మండలాల్లో కొర్రమేను చేపల పెంపకంను చేపట్టనున్నట్లు తెలిపారు.ఐదు లక్షల యూనిట్లు జిల్లాకు మంజూరయ్యాయని, ఇందుకు 30 సెంట్ల భూమిలో గుంత ఉండాలన్నారు.షెడ్డు ఉండాలని,వృథా నీటితో కూరగాయల పెంపకాన్ని చేపట్టవచ్చన్నారు. ఇప్పటివరకు 50 మందిని గుర్తించడం జరిగిందన్నారు.చేపల పెంపకంలో ఎనిమిది నెలలకు పంట వస్తుందని,వాటిని కిలో 250 రూపాయల చొప్పున కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరిందన్నారు. కొర్రమేను చేపల పెంపకంలో ప్రభుత్వం నుండి 35 శాతం సబ్సిడీ వస్తుందని తెలిపారు.ఈ పరిశ్రమ ద్వారా ఎనిమిది నెలలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయం ఉంటుందన్నారు. జిల్లాలో చిరుధాన్యాలను వినియోగించడంపై హోటల్ యజమానులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికీ కుప్పం,పెద్ద పంజాని మండలాల్లో ఇద్దరిని ఎంపిక చేసామని,ఇంకా ఎనిమిది మందిని ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలో డ్వాక్రా గ్రూపులకు కిరాణా దుకాణాలు నడపడానికి 50 వేల రూపాయలు రుణసౌకర్యం కలగచేసి, 500 యూనిట్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 274 యూనిట్లు ఎంపిక చేసామని తెలిపారు. వీరికి ఎంపిక చేసిన సంస్థ ద్వారా అన్ని రకాల కిరాణా వస్తువులను సరఫరా చేస్తారని,గ్రామీణ ప్రాంతాల్లో పండే పంటలను వీరి ద్వారా ఆ సంస్థ కొనుగోలు చేస్తుందని తెలిపారు. చిత్తూరు జిల్లాలో అరకు కాఫీ యూనిట్లను 10చోట్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికీ కాణిపాకం, పుంగనూరులలో గుర్తించామని,యూనిట్ ధర ఆరు లక్షల రూపాయలుగా తెలిపారు.ఇందులో 35 శాతం సబ్సిడీ ఉంటుందని వివరించారు. ప్రధానమంత్రి ఆహార శుద్ధి పథకం ద్వారా స్వీట్స్ తయారీ, బేకరీలకు లక్ష రూపాయలు నుండి పది లక్షల రూపాయల వరకు రుణముగా అందజేస్తామని పేర్కొన్నారు.అలాగే ఆయిల్ మిల్స్,నిల్వ ఉండే ఆహార పదార్థాలు తయారు చేసే సంస్థలకు వర్తిస్తుందన్నారు. జిల్లాలోని తవణంపల్లి, చౌడేపల్లి మండలాల్లో సమీకృత వ్యవసాయం ద్వారా అన్ని రకాల పంటలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు.రైతులు సాంప్రదాయ పంటలకు స్వస్తిపలికి ఆదాయాన్ని ఆర్జించు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాల్సిందిగా ఆమె కోరారు.డిఆర్డిఏ సహకారాన్ని వినియోగించుకొని రైతులు అధిక ఆదాయం పొందాలని ఆమె ఆకాంక్షించారు.

## శ్రీ పొట్టి శ్రీరాములు పాఠశాలలో ఎన్.సి.సి ఎంపికలు





**కావలి పెన్ పవర్–( ఆర్సీ ఇంచార్జ్ ) జులై 15**

కావలి పట్టణంలోని వెంగల్ రావు నగర్ లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల నందు 10 వ ఆంధ్ర నావెల్ యూనిట్, నెల్లూరు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ బాలాజీ, గోదంగవే ,ఆదేశాల మేరకు పి.ఐ స్టాఫ్ పి. లక్ష్మీనారాయణ, ఎన్.వి రమణ విద్యార్థులలో ఎన్.సి.సి నావల్ విభాగం లో యాభై మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్. సి. సి పాఠశాలలో ఉండటం అదృష్టమని విద్యార్థులు అందరూ ఉపయోగించుకొని దానికి సార్థకత చేయాలని కోరారు. ఎన్.సి.సి థర్డ్ ఆఫీసర్ టి.కొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి అలవడి పది మందికి ఆదర్శంగా సమాజం లో నిలబడి గౌరవంగా బ్రతికేలా ఎన్.సి.సి చేస్తుంది అని, పాఠశాలలో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫహీముద్దిన్, వై.రజనీ,బి.సరళ ,భాగ్యమ్మ,సృజన,వాసవి,జనార్దనరెడ్డి మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

